క్లుప్తంగా

16న జాబ్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో డెవలప్‌మెంట్ మేనేజర్ పోస్టు కోసం ఈనెల 16న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగానికి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. ఏడాదికి రూ.2.6 లక్షల జీతంతో పాటు ఇన్సెంటివ్, లైఫ్ కవర్ ఉంటుందని తెలిపారు. వివరాలకు 98857 62227 సంప్రదించాలని కోరారు.

సమ్మెకు టీఏజీఎస్ మద్దతు

ఎదులాపురం: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక, గిరిజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మెకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ హయాంలో ఆదివాసీలపై దాడులు, అడవుల ప్రైవేటీకరణ, షెడ్యూల్ ప్రాంతాల ఎత్తివేత, అటవీ చట్టాల నిర్వీర్యం చేయడం జరిగిందని ఆరోపించారు. గిరిజన ప్రజలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

బోథ్: బోథ్ మేజర్ గ్రామ పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామానికి చెందిన జక్కుల వెంకటేశ్ సోమవారం ఎంపీడీవో సుశీల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. వారసంతంలో తాగునీరు, మూత్రశాలల నిర్మాణం, పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలు వెల్లడించాలన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని నందగిరి స్వామి, నర్సింహ స్వామి, పరిపూర్ణనంద, పద్మనాభ స్వాములు అన్నారు. సోమవారం మండలంలోని కుమారి గ్రామంలో శ్రీ గురుదేవ ఆశ్రమంలో పలువురు భక్తులకు ప్రచనలను బోధించారు. స్వాములను గ్రామస్తులు సత్కరించారు.

బీజేపీ ఎంపీ టికెట్‌కు దరఖాస్తు

ఇచ్చోడ: ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ టికెట్‌కు సినీ నటుడు అభినవ్ సర్దార్ సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కలిసి దరఖాస్తు చేసుకున్నాడు. పలు సామాజిక సేవలు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

వార్షికోత్సవం

ఇచ్చోడ: పూలాజి బాబా ధ్యాన మందిర 36వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఇస్లాంనగర్ పూలాజీబాబా ధ్యాన మందిరలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూలాజీ బాబా సంస్థన్ అధ్యక్షుడు ఇంగ్లె కేశవ్ పాల్గొని మాట్లాడారు. ధ్యాన మందిరాల ద్వారా ఆధ్యాత్మిక చింతన కొనసాగించడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో భగ్వన్, రాందాస్, పాండురంగ్ పానపట్టె మనోహర్, అడవ్ మారుతి పాల్గొన్నారు.

జాతీయస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్: మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన ఝూసి జాతీయస్థాయి నృత్య పోటీల్లో జిల్లా కేంద్రంలోని బాలకేంద్రం చిన్నారులు ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచారు. నేషనల్ డాన్స్ కాంపిటీషన్ అండ్ ఫెస్టివల్– 2024 పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని బాల కేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తెలిపారు. జూనియర్ విభాగంలో కూచిపూడి నృత్యంలో ఇతీక్ష మొదటి స్థానం, అక్షిత రెండో స్థానం, ఓజస్విని మూడో స్థానంలో నిలిచింది. వెస్టన్ విభాగంలో జాహ్నవి, బాలీవుడ్ స్టైల్ విభాగములో హర్షిని, జానపదం విభాగములో శ్రీవర్ధిని అనే చిన్నారులు తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. కూచిపూడి సీనియర్ విభాగంలో శ్రీనిధి, హర్షిని మొదటి స్థానంలో నిలవగా, సంజనకు మూడో స్థానం దక్కింది. సెమీ క్లాసికల్ నృత్య విభాగంలో అక్షరగీత థర్డ్ ప్లేస్, డ్యూయెట్ కూచిపూడి నృత్య విభాగంలో అలేఖ్య, శ్రీనిధి మొదటి స్థానంలో నిలవగా నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన దుకాణలు, హోటల్స్ నిర్వాహకులు ఫుడ్ సెఫ్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సెఫ్టీశాఖ ఎఫ్‌ఎస్‌వో నాయక్ హెచ్చరించారు. సోమవారం నాగోబా జాతరకు సందర్శించి హోటల్స్, పాస్‌ఫుడ్ సెంటర్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. కాక్యక్రమంలో సిబ్బంది సఖిల్, తదితరులు పాల్గొన్నారు.

16న సర్వసభ్య సమావేశం

నేరడిగొండ: నేరడిగొండ మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 16న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ రాథోడ్ సజన్ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

అమృత్ 2.0 పనులకు గ్రీన్‌సిగ్నల్

- టెండర్లను ఆహ్వానించిన ప్రభుత్వం
- పక్షం రోజుల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశం

తాగునీటి పనుల కోసం వెచ్చించాల్సిన వ్యయం వాటాల వివరాలిలా.. (రూ.కోట్లలో)

కేంద్రం	రాష్ట్రం	బల్దియా	15వ ఆర్థికసంఘం
29.50	52.42	7.01	6.57



వాటర్‌ట్యాంక్

కైలాస్‌నగర్: మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద విడుదల చేసిన నిధులతో పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.95.50 కోట్ల వ్యయంతో పనుల నిర్వహణ కోసం కాంట్రాక్టర్ల నుంచి రాష్ట్రస్థాయిలో టెండర్లు సైతం ఆహ్వానించింది. ఖరారైన వెంటనే పట్టణంలోని తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న కాలనీల్లో పనులు ప్రారంభించేలా అధికారులు ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేశారు. పనులు ప్రారంభమైతే బల్దియా పరిధిలో తాగునీటి తిప్పలు తప్పనున్నాయి.

పది నెలల క్రితం నిధులు మంజూరు

కేంద్రం అమృత్ 2.0 పథకం కింద గతేడాది మే 20వ తేదీన రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందు కోసం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు జీవోనంబర్ 312ను జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు బల్దియా కూడా తమ వాటా చెల్లించి తాగునీటి పనులు చేపట్టేలా మార్గదర్శకాలు జారీ చేసింది. అప్పుడే పనులు ప్రారంభించాల్సి ఉండగా టెండర్లు వేసేందుకు గుత్తేదారులు ఎవరు ముందుకు రాలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొద్ది రోజుల పాటు ఈ పనులను నిలిపివేసింది. తాజాగా చేపట్టేందుకు అనుమతినివ్వడంతో త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశముంది.

తాగునీటికి ఇబ్బంది లేకుండా

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో గతంలో 36 వార్డులుండేవి. 2018లో పట్టణ పునర్విభజనలో భాగంగా ప్రభుత్వం మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న మావలలోని పలు కాలనీలు, అనుకుంట, రాంపూర్ గ్రామాలు, బట్టిసావర్గాం పంచాయతీ పరిధిలోని న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీని మున్సిపల్‌లో విలీనం చేస్తూ 49 వార్డులను ఏర్పాటు చేసింది. దీంతో పట్టణ జనాభా భారీగా పెరిగింది. వారి అవసరాలకనుగుణంగా తాగునీరు అందడం లేదు. పలు కాలనీల్లో ప్రజలు ఇప్పటికీ తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన దుస్థితి. చేతిపంపులపైనే ఆధార పడాల్సి వస్తోంది.

135 లీటర్ల నీటిని అందించేలా..

ప్రతీ వ్యక్తికి రోజుకు 135 లీటర్ల నీటిని అందించేలా పనులు చేపట్టనున్నారు. అమృత్ కింద మంజూరైన నిధులతో తాగునీటి సమస్య గల కాలనీల్లో వాటర్ ట్యాంకులను నిర్మించనున్నారు. తాగునీటి సరఫరాకు అవసరమైన పైపులైన్లు, నల్లా కనెక్షన్ల ఏర్పాటు వంటి పనులను మున్సిపల్ పరిధిలోని పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా చేపట్టనున్నారు. ఏయే కాలనీల్లో పనులు చేపట్టాలనే దానిపై ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. టెండర్లు ఖరారైన వెంటనే ప్రారంభించనున్నట్లుగా పబ్లిక్ హెల్త్ ఈఈ గంగాధర్ తెలిపారు. వారంలోగా టెండర్లు ఖరారయ్యే అవకాశముందని మరో పదిహేను రోజుల్లోగా పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

పనులు ప్రారంభమయ్యేలా చూడాలి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాల్టీకి అమృత్ 2.0 పథకం కింద మంజూరైన తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చూడాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ కోరారు. సోమవారం మున్సిపల్ ప్రజారోగ్య శాఖ ఈఈ గంగాధర్‌ను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో కలిసి ఆయా అంశాలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం రూ. 95.50 కోట్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ కోసం రూ.225 కోట్లను మంజూరు చేసిందన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేట్, కొత్తగూడ, నర్సాపూర్(బి) గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, త్వరలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యుం, నాయకులు ఎక్బాల్, తాజా మాజీ సర్పంచ్ రాహుల్, కలీం పాషా కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న అడే గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అడే గజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని వడూర్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ.10లక్షల నిధులు మంజూరు కావడంతో భూమిపూజ చేసి సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతున్నారంటే కాంగ్రెస్ పార్టీతోనే అని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల ఊశన్న, నాయిడి రవి, బొలిశెట్టి రాములు, పాల శంకర్, సయ్యద్ ఇసాఖొద్దీన్, ధర్మదాస్ మహేందర్, ఈర్ల శ్రీకాంత్, గాదె రవి, కుంట శంకర్, గాదె రవి పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఎస్‌వీ శ్రీకాంత్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం విద్యను సంక్షోభంలోకి నెట్టిందని, కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచన చేసి 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రాజు, పీడీఎస్‌యూ నేతలు ఎర్రోజు హరీష్, మాడవి గణేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ, పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ కళావతి, నాగేందర్, దీపమాల, గిరిజ, దత్తు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి


జైనథ్: పూజలు చేస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

నేరడిగొండ: భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలను సోమవారం మండలంలోని కుమారి గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. మార్కండేయ చూపిన బాటలో ప్రతిఒక్కరూ పయనించాలని సూచించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు అలకంటి రమణయ్య, ఉపాధ్యక్షుడు కైరంకొండ లచ్చన్న, కార్యదర్శి డోకూరు మహేందర్, వీడీసీ అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంతో పాటు ధన్నూర్(బి) గ్రామంలో మార్కండేయ మహర్షి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. బోథ్‌లోని మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు ఆసాల సదాశివ్, పట్టణ అధ్యక్షుడు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనం స్థలం వద్ద సోమవారం మార్కండేయ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. మార్కండేయ మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు తలకొక్కుల రామన్న, జైనథ్ తాజామాజీ సర్పంచ్ దుమాల దేవన్న, రవీందర్, దాసరి వెంకటి, సురేశ్, సంజీవ్, దాసరి అడెల్లు, అడెళ్ళ బాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ సీఐగా భీమేశ్


భీమేశ్


సాయినాథ్

ఇచ్చోడ: ఇచ్చోడ సీఐగా భీమేశ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్ ఆదిలాబాద్ సీసీఎస్‌కు బదిలీ కాగా.. బోథ్ సీఐ భీమేశ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు.

జైనథ్ సీఐగా సాయినాథ్

జైనథ్: జైనథ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సాయినాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసి సీఐ కోల నరేశ్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో సాయినాథ్ నియమితులయ్యారు. దీంతో సోమవారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీడీవోకు సన్మానం

తాంసి: ఎన్నికల బదిలీల్లో భాగంగా బదిలీపై వెళ్తున్న భీంపూర్ ఎంపీడీవో శ్రీనివాస్‌ను సోమవారం సన్మానించారు. ఎంపీడీవోను కార్యాలయ ఆవరణలో జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ సంతోష్, సిబ్బంది సత్కరించారు. మండల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. నాయకులు చిల్కూరి సంజీవ్ రెడ్డి, లస్మన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురుకులాల బోధన, బోధనేతర సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సోమవారం ఆదిలాబాద్‌లోని గిరిజన సంక్షేమ, గురుకుల డిగ్రీ కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది కళాశాలల ఎదుట ఆందోళన చేపట్టారు. గత దశాబ్ద కాలం నుంచి వివిధ యజమాన్యాల కింద నడుస్తున్న గురుకులాల్లో అపరిష్కృతంగా ఉన్నటువంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే బదిలీలు, చేపట్టాలన్నారు. విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలని, కళాశాలలకు భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. బ్యాక్‌లాక్ పోస్టులతో ఖాళీలను భర్తీ చేయాలని, దీంతోపాటు విద్యార్థుల పాకెట్ మని చార్జీలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లు చేపట్టాలి

జైనథ్/కైలాస్‌నగర్: ప్రైవేటు మార్కెట్‌లో సోయా ధర భారీ పడిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే స్పందించి మండలంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి కోరారు. ఈమేరకు ఆయన జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే మద్దతు ధర చెల్లించి, సోయా కొనుగోళ్లు చేపట్టాలని కోరారు.

‘ప్రొటోకాల్ పాటించకపోతే ఊరుకోం’


సిరికొండ: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గుడిహత్నూర్: కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించక పోతే ఊరుకోమని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తిరుమల్ గౌడ్, జాదవ్ భీంరావ్ నాయక్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నియోకవర్గ నాయకుడు ఆడే గజేందర్ ప్రొటోకాల్‌ను విస్మరించి ప్రభుత్వ పనులను ప్రారంభించడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు పవార్ రవీందర్, ఎండీ గఫార్, కుమ్ర శంభు, ససానే సిద్ధార్థ్, ప్రకాష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రజాస్వామ్యాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివా రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసం మాట్లాడారు. ప్రొటోకాల్ లేని వ్యక్తి అధికారిక కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. ఆడే గజేందర్‌కు సీసీరోడ్డు నిర్మాణాల భూమి పూజలో ఎలా పాల్గొంటారని మండిపడ్డారు. సమావేశంలో ఎంపీపీ రాథోడ్ సజన్, తాజా మాజీ సర్పంచ్ పెంట వెంకట రమణ, అల్లూరి శ్రీనివాస్ రెడ్డి, గులాబ్ సింగ్, సాబ్లే ప్రతాప్ సింగ్, సద్దాం, రాథోడ్ సురేందర్ పాల్గొన్నారు.

సిరికొండ: ప్రొటోకాల్ లేని వ్యక్తి అధికారిక కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొంటున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుడు అడే గజేందర్ సీసీరోడ్ల భూమిపూజలో పాల్గొనడం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఓరగంటి పెంటన్న, ఎక్బల్, లతీఫ్, సూర్యకాంత్, రోహిదాస్, భీంరావు, మల్లేష్ పాల్గొన్నారు.

బోథ్‌లో గ్రామసభ


గ్రామసభలో పాల్గొన్న సభ్యులు

బోథ్: మండల కేంద్రంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సరిగా లేదని, సాయినగర్‌లో మురికి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరారు. రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుశీల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కేసీఆర్’


ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కైలాస్‌నగర్: కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసి అసెంబ్లీలోకి అడుగుపెట్టేందుకు జంకుతున్న మాజీ సీఎం కేసీఆర్ ఏ ముఖం పెట్టుకుని నల్గొండ సభకు వెళ్తారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. సోమవారం ఎన్టీఆర్‌చౌక్‌లో కేసీఆర్ ఫ్లెక్సీని చెప్పులతో కొడుతూ దహనం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ.. కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎంత సమయం అడిగిన ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి అంటే అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తున్నారని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే నల్గొండ సభను ఏర్పాటు చేశారని మండిపడ్డారు. ఇంకా ఎన్ని అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తావని ప్రశ్నించారు. ప్రాజెక్టులు పూర్తి చేయకుండా రైతులకు సాగునీరు ఇవ్వకుండా మోసం చేసిన ఘనత కేసీఆర్‌దేనని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, గుడిపెల్లి నగేశ్, సామ రూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి


క్రీడాకారులతో అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్: జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని డీసీసీబీ చైర్మన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి అన్నారు. జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులకు జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో సోమవారం జెర్సీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన కనబరుస్తుండడం శుభపరిణామం అన్నారు. జిల్లాలో ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. వారిని అత్యున్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అసోసియేషన్ తరపున కృషి చేస్తున్నామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్ మాట్లాడుతూ.. ఈనెల 14 నుంచి 19వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి 19వ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీఈటీలు రాకేశ్, జ్యోతిశ్వరన్ తదితరులున్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: టీయూటీఎఫ్ తలమడుగు మండల కార్యవర్గాన్ని సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని సంఘ భవనంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జయవర్ధన్ రెడ్డి, అధ్యక్షుడిగా ఎం.సంజీవ్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి, మహిళ అసోసియేట్ అధ్యక్షురాలిగా జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్, సంయుక్త కార్యదర్శిగా రాజీవ్‌రెడ్డి, మహిళ సంయుక్త కార్యదర్శిగా విజయలక్ష్మి, కోశాధికారిగా కృష్ణసాగర్, కార్యదర్శులుగా జగన్, నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, జగన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, జలందర్ రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు అవగాహన

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పీపుల్స్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై సోమవారం అవగాహన కల్పించారు. విషయ నిపుణులు సదానందం, రమేశ్ బాబు, ఆడెపు నరేశ్, పోటీ పరీక్షల నిపుణులు రమణ గౌడ్, అల్లం సాయికృష్ణలు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మెస్రం రాములు, న్యాయవాది పంద్రం శంకర్, వ్యవసాయ విస్తరణ అధికారి కొట్టూరి శ్యాం, సభ్యులు కార్తీక్, అనిల్, కుషాల్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఎదులాపురం: రెండు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. నూతనంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పీడీ సుభద్రకు సోమవారం ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌తో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ సమస్యలను వివరించారు. పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, 14 రిజిస్టర్‌లకు బదులు, 5 రిజిస్టర్‌లను కొనసాగించాలని, రెండు యాప్‌లకు బదులు ఒకే యాప్‌గా కొనసాగించాలని పీడీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వివిధ మండలాల అంగన్‌వాడీలు ఎం.లలిత, వజ్ర మాల, రాధ, సంగీత, పుష్పలత పాల్గొన్నారు.

మాడగూడలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బజార్‌హత్నూర్: మండలంలోని మాడగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 45 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు సుదర్శన్, పీహెచ్‌ఎస్ సుశీల, హెల్త్ సూపర్‌వైజర్ దేవిదాస్, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, మంజుల, మమత పాల్గొన్నారు.